
తెలుగు కళా సమితి న్యూజెర్సీవారి కథల పోటీలో రూ. 300/- బహుమతి పొందిన కథ



# ఏరు దాటాక

-పినిశెట్టి శ్రీనివాసరావు

**కొలీగ్ కృష్ణమూర్తి పోయి అప్పుడే మూడు నెలలయ్యింది. కాలచక్రం ఎంత వేగంగా తిరిగి పోతుంది! కృష్ణమూర్తి ఇంకా కళ్లముందే వున్న ట్లనిపిస్తోంది.**

నలభయ్యవ ఏట వయసులోనే మృత్యువాత పడడం కృష్ణమూర్తి స్వయంకృతం. మనిషి వ్యసనాలకు లోను కాకుండానే వుండాలి. సరదా కోసం, స్టేటస్ కోసం అంటూ మొదలు పెట్టి వ్యసనాల ఊబిలో కూరుకుపోయాక పైకి లాగడం ఎవ్వరి తరం కాదు. తాడు-బొంగరం లేని బ్రహ్మచారిగాడు తాగి తందానాలాడాడంటే అదోరకం. పెళ్లాం-పిల్లల్తో వున్నవాడు, బాధ్యత మరచి వ్యసనాలకు బానిసైపోతే అకాల మరణం ప్రాప్తిస్తే, ఆపైన జీవితాంతం ఏడ్చేదీ-చచ్చేదీ వాడి పెళ్లాం, పిల్లలే.

కృష్ణమూర్తి కేసు అక్షరాలా ఇలాంటిదే.

నెలకొచ్చే జీతం మాట అలా వుంచితే పైన ఎంత లేదన్నా నెలకు నాలుగైదు వేలు కంట్రాక్టర్ల బిల్లులు పాస్ చేసినందుకు ముడతాయి. ఇద్దరాడ పిల్లలు కలవాడు, పైన వచ్చిన డబ్బు జాగ్రత్తచేసుకొనుంటే అది కొంత నయంగా వుండేది.

కాని... నెత్తిమీద శని కూర్చుంటే మంచి బుద్ధి ఎలా వస్తుంది? అవసరానికి మించిన డబ్బు-మనిషిని దురలవాట్లకు దగ్గర చేస్తుంది. అందుకనే కృష్ణమూర్తి సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లాలన్న సంగతి మర్చిపోయాడు. పేకాట-మందు పార్టీలు వగైరా అతని నిత్యకృత్యాలయ్యాయి.

ఫలితం - షరా మామూలే. వాడి అకాల మరణం - వాడి పెళ్లాం, పిల్లలకు కష్ట కాలం ప్రారంభం.

ఏవిటో - కృష్ణమూర్తి గుర్తొచ్చినప్పుడల్లా మనసు అదోలా అయిపోతుంది. మనిషి చెడిపోయాడే కానీ - చెడ్డవాడు మాత్రం కాదు. స్నేహానికి ప్రాణం ఇస్తాడు. మర్యాదస్తుడు - మరుకైనవాడు. ఎన్ని సుగుణాలుంటే ఏం లాభం? గ్రహణం పట్టిన చంద్రుడిలా క్షీణించి పోయాడు. గ్రహణం వదిలేలోగా ఈ లోకాన్నే వదిలిపోయాడు.

* * *

కృష్ణమూర్తి భార్య రమ్మందంటే వాళ్ల ఇంటికి వెళ్లాను. నన్ను చూడగానే ''కూర్చోండి అన్నయ్యా'' అంటూ కుర్చీ చూపించింది కృష్ణమూర్తి భార్య లక్ష్మి.

''ఏమ్మా నన్ను రమ్మని కబురు పంపావట. అంతా కులాసాయేనా? ఈ మధ్య పని వత్తిడి వల్ల ఇటు రావడం పడలేదు'' అన్నాను.

''అవునన్నయ్యా... నేనే రమ్మని కబురు పెట్టాను. నీకు తెలుసు కదా. మూడు నెలలయినా ఆఫీసు నుంచి ఎటువంటి డబ్బూ అందలేదు. హైద్రాబాదు వెళ్లి ప్రయత్నం చేస్తే కాని పనులు కావంటున్నారు. ఆయన వున్నప్పుడు తరచూ వచ్చే శాస్త్రిగారు, శంకరం గారు, శర్మగారు వీళ్లెవరూ మా ఇంటి ఛాయలకైనా రావడంలేదు. పోనీ మా అన్నయ్య లెవరినైనా పిలిపించుకుందామా అంటే ఒకడు మహారాష్ట్రలో, మరొకడు కేరళలో ఉద్యోగాలు చేస్తున్నారు. సెలవు పెట్టి ఎన్ని రోజులని ఇక్కడకు వచ్చి వుంటారు? వాళ్లకు ఇక్కడి విషయాలు కూడా తెలియవాయె. అందుకనే మీకు కబురు పెట్టాను. ఇన్సూరెన్సు డబ్బు కూడా ఇంతవరకూ అందలేదు. చేతిలో డబ్బు కూడా అయిపో వచ్చింది. పస్తులైనా వుంటాము కానీ ఒకరి దగ్గర చెయ్యిచాచటం నావల్ల కాదన్నయ్యా! నువ్వేమీ అనుకోనంటే మాకు రావల్సిన డబ్బు ఎలాగైనా త్వరగా అందేలా ప్రయత్నం చేయాలన్నయ్యా. మీరు తప్ప నాకు ఇంక ఆప్తులెవ్వరూ కన్పడడం లేదు'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకుందామె.

పక్కనే కొంచెం దూరంలో చదువు కుంటున్న కృష్ణమూర్తి ఇద్దరాడ పిల్లలూ బిక్కమొహాలు వేసుకుని చూస్తున్నారు.

నా కళ్లు చెమ్మగిల్లాయి.

ఇంటి యజమాని లేకపోయిం తర్వాత ఆ కుటుంబం ఎంత నిరాదరణకూ, భయానికీ, వేదనకూగురవుతుందో ఆ ఇంటి వాతా వరణంలో కన్పడంది.

''ఊరుకోమ్మా - ఊరుకో. నువ్విలా బాధ

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

పడుతుంటే, పిల్లలు మరింత బెంబేలు పడిపోతారు. కష్టాలు కలకాలం వుండవు. మంచి రోజులు త్వరలోనే వస్తాయి. మీకు ఆఫీసు నుంచి రావల్సిన సొమ్ము - అలాగే ఇన్సూరెన్సు డబ్బు త్వరగా వచ్చే ప్రయత్నం చేస్తాను. అవసరం అనిపిస్తే హైద్రాబాద్ కూడా వెళ్లొస్తాను. ఈలోగా నీకేదైనా డబ్బు అవసరం అనిపిస్తే మొహమాటపడక నన్ను అడుగమ్మా'' అని ధైర్యం చెప్పి వచ్చాను.

ఏ మనిషినైనా ఆపదలో - అవసరంలోనేగా ఆదుకోవాలి? ఈ కష్టకాలంలో కృష్ణమూర్తి కుటుంబానికి నా చేతనైన సహాయం చేయడం నా కనీస ధర్మం అనిపించింది.

నిజానికి కృష్ణమూర్తి పోయాక, మున్సిపల్ ఆఫీస్ నుంచి 'డెత్ సర్టిఫికెట్' సంపాదించడం దగ్గర నుంచి, 'పవర్ ఆఫ్ ఎటార్నీ' పేపర్లు తెచ్చి పెట్టడం, ఆఫీసునుంచి కృష్ణమూర్తికి రావలసిన డబ్బుకు 'క్లైమ్స్' తయారుచేయించి హైదరాబాద్‌కు పంపించేంతవరకు సహాయం చేసింది నేనే. నేననే ఏమిటి? నేను కాకపోతే మరెవరైనా ఈ సహాయం చేసేవారే.

* * *

మరో మూడు నెలలు గడిచే సరికి ఆఫీసు డబ్బూ - ఇన్సూరెన్సు డబ్బూ మొత్తం కృష్ణమూర్తి భార్య చేతి కందింది. కాకపోతే, రెండు సార్లు నేనే స్వయంగా హైద్రాబాదు వెళ్లొచ్చాను. నాకున్న పరపతి వినియోగించినా, బిల్లులు పాస్ చేయించడానికి ఎవరికి ముట్ట చెప్పాల్సింది వాళ్లకి ఇవ్వక తప్పలేదు. బాధ్యత తీసుకున్నాక కష్టనష్టాలకు ఓర్చుకోవాలి - భరించాలి. నాకే అనుకోని ఖర్చు తగిల్తే ఏం చేసేవాడిని? ఇదీ అంతే. మనసును సమాధాన పర్చకపోతే మనశ్శాంతి కరువైపోతుంది. మధ్య తరగతి జీవితాలింతే-ఇంతే.

గ్రాట్యుటీ, ప్రావిడెంట్‌ఫండ్, ఇన్సూరెన్సు మొత్తం కలిపి రెండు లక్షలదాకా ముట్టింది కృష్ణమూర్తి కుటుంబానికి.

నేను చేసిన సహాయానికి మూర్తి భార్య ఎంతో కృతజ్ఞత తెల్పింది. ఎంతో ఋణ పడివుంటానని చెప్పింది. ఇప్పుడు . తనకెంతో ధైర్యంగా వుందని చెప్పింది. ఇంతకు మునుపు నేను ఆవిడలో చూసిన నైరాశ్యం - అధైర్యం స్థానే - ఇప్పుడు కొత్త ఆశ - వెలుగు చూస్తున్నాను.

భర్త మరణంతో స్త్రీ కోల్పోయేవి రెండు - ఒకటి తోడు, రెండు నీడ. పోయిన మనిషి ఎలాగూ తిరిగిరాడు. నీడ విషయానికొస్తే, తను, తన పిల్లల మెయింటినెన్స్‌కు మరొకరి మీద ఆధారపడాల్సిన దుస్థితిని ఏ భర్త పోయిన స్త్రీ భరించలేదు. ఆ గాయాన్ని జీవిత కాలం మర్చిపోలేదు. కాని ఆర్థిక స్తోమత గలిగిన స్త్రీకి త్వరగా ఆ గాయాన్నుంచి తేరుకునే అవకాశం వుంటుంది.

డబ్బు మనిషికి ప్రాణం పోయలేకపోవచ్చు. కానీ కొన్ని ప్రాణాలు పోకుండా నిలుపగలదు, గాయాల్ని మాన్పగలదు. మరెన్నో సమస్యలను తీర్చగలదు.

* * *

ఒక రోజు నేను కృష్ణమూర్తి ఇంటికి వెళ్లేసరికి, ముందు గదిలో కృష్ణమూర్తి భార్యా - పిల్లలూ టి.వి.లో ఏదో సినిమా చూస్తున్నారు. పక్కనే బల్లమీద వి.సి.పి. వుంది.

నన్ను చూడగానే ''రండన్నయ్యా... పిల్లల గొడవ పడలేక వి.సి.పి. కొన్నాను. పిల్లలు స్కూలుకెళ్లిపోయాక నాకూ ఇంట్లో ఏం తోచడం లేదు. అద్దెకు తెచ్చుకుంటే బోల్డు రెంటయిపోతోంది. అందుకనే పక్కింటి వాళ్ల ద్వారా ఈ వి.సి.పి. కొన్నాను. నెలకు నూట ఏభై రూపాయిలు కడ్తే రోజూ ఒక కేసెట్ వాడే ఇంటికొచ్చి ఇచ్చిపోతాడు'' అంది మూర్తి భార్య.

మౌనంగా విని ఊరుకున్నాను.

డబ్బుతో పాటు - కాలానికి మనసుకు పడ్డ గాయాల్ని మాపే శక్తి వుంది.

దేవుడు మనిషికి ఇచ్చిన గొప్ప వరం ఇదే. వాళ్లతో పాటు నేనూ ఓ పదినిమిషాలు టి.వి.లో సినిమా చూసిన తర్వాత ''వస్తానమ్మా'' అని చెప్పి లేచాను.

నాతో పాటు బైట గేటు దాకా వచ్చిన మూర్తి భార్య, ''అన్నయ్యా ఒక్కమాట... మరేం లేదు. ఆయన ఆఫీసువాళ్లకు అప్పులి స్తుండే వారని గుర్తు. అలా ఎవ్వరెవ్వరికి ఎంతెంత అప్పులిచ్చారో ఎలా తెలుస్తుంది? ఎవర్నని అడగ్గలం? ఏదైనా కాయితాల మీద వుంటేగా? వాళ్లంతట వాళ్లే తీసుకున్న డబ్బు తిరిగిచ్చే నిజాయితీ పరులున్నారంటారా ఈ రోజుల్లో. అయినా ఎవర్నసుకుని ఏం లాభం? మన బంగారం మంచిది కానప్పుడు. ఈ పరిస్థితుల్లో వేరే ఎవ్వరినీ స్వతంత్రించి అడిగే ధైర్యం నాకు లేదు - మిమ్మల్ని తప్ప'' అంది మూర్తి భార్య.

ఆమె నన్నేం అడగదల్చుకుందో నాకు అంతుబట్టలేదు. మౌనంగా వింటున్నాను అంతే.

''మరేం లేదన్నయ్యా... ఒకవేళ నువ్వుకాని ఆయన దగ్గర ఏదైనా డబ్బు అప్పుగా తీసుకుంటే...''

ఆమె అంతరార్థం నాకు అర్థమయ్యింది.

అంతకంటే నాకు బాగా అర్థమైంది నా అవసరం ఇక ఆమెకు లేదు. ఒడ్డుకు చేరుకుంది ఆమె.

ఆ రోజు, మిమ్మల్ని తప్ప ఎవర్నీ సహాయం అడగలేనన్న ఆమె, ఇవాళ, మిమ్మల్ని తప్ప (వెయ్యని) అప్పు తీర్చమని ఎవర్నీ అడగలేనంటోంది!

''అప్పు తీసుకుని వుంటే, అడిగేదాకా ఇవ్వకుండా వుంటానామ్మా'' అంటూ, రాని నవ్వును ముఖం మీద పులుముకుని గేటు తీసుకుని బయటికి నడిచాను.


యర్రంశెట్టి శాయి
కొత్త సీరియల్
మరణానికి చిరునామా
త్వరలో!